

## ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ అంపైర్‌గా శరత్

కవిటి, జనవరి 10 ప్రభాతవార్త: కవిటి గ్రామానికి చెందిన తుంగాన శరత్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 18 వరకు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీలలో ఆయన అంపైర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఉషోదయ యువజన సంఘం సభ్యుడిగా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సేవలందిస్తున్న తుంగాన శరత్ ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన ఎంపికకు సంబంధించి రాష్ట్ర, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ల నుంచి అధికారిక ఉత్తర్వులు అందినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది తమరాల జయరాం తెలిపారు. దేశ రాజధానిలో జరిగే అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కవిటి యువకుడు అంపైర్‌గా ఎంపిక కావడం ఉద్దాన ప్రాంతానికి గర్వకారణం అని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ళ రాజేష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ బెందాళం రమేష్, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మరియు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఆకులతంపర గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ర్యాలీ



కొత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆకులతంపర గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్య నారాయణ ఆదేశాల మేరకు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కొత్త గ్రామాల్లో ఎంటి సూర్య నారాయణ, స్థానిక సర్పంచ్ నాగల్ల అప్పన్నల ఆధ్వ ర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ (కెఏపీ)లో భాగంగా ప్రకృతి వ్యవసాయ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో ర్యాలీలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వాడకం వల్ల భూమి సారం పోగొట్టుకుంది. జబ్బులు పెరిగి దిగుబడులు తగ్గాయి. వాతావరణ మార్పులకు రసాయనాలు, పంట అవశేషాలు కాల్చడమే ప్రధాన కారణమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో ఈ సమస్యలను అరికట్టవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్‌డిఎస్ వేరుశనగలో అంతరపంటల ఫీల్డ్‌కు వెళ్లి, అంతరపంటల వాడకంతో కలిగే లాభాలు, ద్రవ జీవామృతం తయారీ విధానంపై డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగల్ల అప్పన్న, ఎంటి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి చిన్నమ్మి, సీనియర్ ట్రైనీ ఐసీఆర్‌పీలు ముఖలింగం, శ్రీను, బాల, సంతోష్, రూప తదితరులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## సహస్ర సంకల్ప యాత్రకు మద్దతు తెలపాలి

**- బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు**



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త: జనవరి 11న ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టే సహస్ర సంకల్ప యాత్రకు అందరూ మద్దతు తెలపాలని పాతపట్నం మండలం పెద్దలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026లో భాగంగా బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం రావివలస ఎండల మల్లిఖార్జున స్వామి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఓంకార జపాన్ని ఉమామహేశ్వరరావు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ సోమనాథ్ ఆలయంపై 1025 జనవరిలో గజినీ మహమ్మద్ దాడి చేసి 2026 జనవరి నాటికి వెయ్యేళ్ళు పూర్తి అయ్యిందని, అలాగే 1951లో డా. బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్ల (అమృతోత్సవం) పూర్తవుతుందన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోడీ జనవరి 11న సోమనాథ్ క్షేత్రంలో సహస్ర సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్నారని ఆయన తెలియజేశారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని, హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని మరియు సోమనాథ్ ఆలయ చరిత్రను వాట్సాప్ గ్రూపులతో పాటు ప్రజలందరికీ తెలియజేయాలని ఉమామహేశ్వరరావు కోరారు.

## సంక్రాంతి సంబరాల్లో సాంప్రదాయ దుస్తులతో వైద్యులు



సీతంపేట, జనవరి 10 ప్రభాతవార్త సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సాంప్రదాయ దుస్తులను వైద్యులు, సిబ్బంది ధరించి తెలుగు సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా జరుపుకున్నారు. మొదటి రోజు పిండి వంటలను వారి ఇంటి వద్ద వండి వాటి రుచులను అందరికీ పంచి వారిలో ఎవరు బాగా వండారు అనేది న్యాయ నిర్ణేతలు ధ్రువీకరించి బాగా వండిన వారికి ఉత్సాహపరిచారు. రెండో రోజు సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఉత్సాహ పరిచారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావుతో పాటు మిగిలిన వైద్యులు తెల్లపంచి, తలపాగా, షర్టు ధరించి తెలుగు సాంప్రదాయాన్ని తెలియజేశారు. మహిళా వైద్యులు సిబ్బంది స్వచ్ఛమైన తెలుగు వస్త్రాలు ధరించి హిందూ సాంప్రదాయాన్ని కట్టిపడే విధంగా దుస్తుల్లో అలంకరించారు. నిత్యం విధుల్లో బిజీ బిజీగా ఉన్న వీరంతా రెండు రోజులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వీరు స్పష్టం చేశారు.

## సంక్రాంతికి ఊరెళ్తున్నారా... జాగ్రత్తలు పాటించండి : ఎస్సై షణ్ముఖరావు



వీరఘట్టం, జనవరి 10 ప్రభాతవార్త సంక్రాంతికి ఊరు వెళ్తున్నారా... అయితే తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విలువైన ఆభరణాలను ఇంట్లో పెట్టొద్దని, నగదు, బంగారం వంటివి బ్యాంకు లాకర్‌లో పెట్టడం ఉత్తమమని ఆయన అన్నారు. అలాగే సిసి కెమెరాల పనితీరును ఊరెళ్లే ముందు పరిశీలించాలని, పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారాన్ని ఇవ్వాలని ఆయన అన్నారు. అదేవిధంగా సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని, యాప్ ద్వారా తరచూ సీసీటీవీ ఫుటేజులను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఊరు వెళ్లే ముందు చుట్టుపక్కల వారిని నిఘా పెట్టాలని మరీ చెప్పి వెళ్లాలని ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు.

## బంధువుల ఇంటికి వెళితే సమాచారం ఇవ్వాలి



కోటబొమ్మాళి, జనవరి 10 (ప్రభాతవార్త) ఇంటికి తాళాలు వేసి సంక్రాంతి పండగకు బంధువుల ఇంటికి వెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు. ఆయన శనివారం మండల కేంద్రంలో పలు వాహనాలను అనుమతి పత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరమైన నియమ నిబంధనలు వాహనదారులు పాటించాలని ఆయన కోరారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ వినియోగించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సైతం శాంతి భద్రతలు విఘాతం కల్పించకుండా స్నేహ పూర్వకంగా ఉండాలని ఆయన సూచించారు. సంక్రాంతి పండగకు బంధువులు ఇళ్లకు తాళం వేసి విలువైన వస్తువులు ఉంటే తీసుకు వెళ్లాలని ఆయన తెలిపారు.

## మెగా బ్లడ్ క్యాంప్ మరియు వైద్య శిబిరం



మెళియాపుట్టి, జనవరి 10 ప్రభాతవార్త మండలంలో మర్రిపాడు సి పంచాయతీ జలకలింగపు రం గ్రామం జనసేన నాయకుడు పార్టీ ఆదేశాల మేరకు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో మెగా బ్లడ్ క్యాంప్ మరియు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా జెమ్స్ వారి సహకారంతో శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్ జన్మదిన వేడుకలు సందర్భంగా జలక లింగపురంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఉచిత వైద్య శిబిరంలో 260 ఓ పి, 56 మందితో బ్లడ్ డొనేషన్ క్యాంప్, కంటి శిబిరం, బీపీ, షుగర్ మొదలగునవి వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం, మెడిసిన్స్, అధిక మొత్తంలో ప్రజలకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన చేసిన అనేక సేవలు గురించి వివరిస్తూ ముగించారు. కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు వసుంధర సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఏఎంసీ డైరెక్టర్ చింతల ప్రశాంత్, సవర రామమూర్తి, లక్ష్మీపురం కిరణ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఊర్లన వసంత్ కుమార్,బిజెపి నాయకులు సలాన రాఘవరావు, నక్క వెంకటరావు, రాణా జనార్దనరావు, పత్రి మణికంఠ, కొల్లి వాసు, సవాలాపురం చంటి, నల్లకాంతం చిన్నికృష్ణ, గొర్లె అనురాధ, లక్ష్మి, దొర విజయ్ కుమార్, పిట్ట హరికృష్ణ, పిట్ట చంద్రశేఖర్, మధుసుధన రావు, మణిక శ్రీను,కొంచాడ శంకరరావు, రవ్వల దుర్యోధన, గొర్ల శ్రీను, కొత్తపల్లి యుగంధర్, రట్టి పాల్గునరావు, రవ్వల రామకృష్ణ, వంజంగి రమేష్, గేదెల తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.



**కంచిలి మండలం డీజీ పురంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సోమనాద్ నాయక్ (70)మరణం సందర్బంగా శనివారం తెలుగుదేశం పార్టీ కంచిలి మండలం నాయకులు వెళ్లి పరామర్శించడం జరిగింది. ప్రభాతవార్త-కంచిలి**

## గ్రామ యువత ఆధ్వర్యంలో శ్రమదానం



కవిటి, జనవరి 10 ప్రభాతవార్త: ఇద్దివానిపాలెం గ్రామ యువత ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం జరిగింది. యువకులు గ్రామంలో ఉన్న ప్రధాన ప్రదేశాల్లో పరిశుభ్రం చేశారు. ఇటీవల కాలంలో గ్రామంలో ప్రజలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ముఖ్యంగా డయేరియా బారిన పడడంతో యువత గ్రామంలో ఉన్న పెద్దలు సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ ఉప్పాడ రామారావు, వారధి పురుషోత్తం, యుగంధర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరజ్యోతిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త స్థానిక అమరజ్యోతి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. వైస్ ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెలుగువారి పెద్ద పండుగ విశిష్టతను చాటిచెబుతూ పాఠశాల ప్రాంగణమంతా పల్లె వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆధునిక పోకడల్లో పడి విద్యార్థులు మన మూలాలను మర్చిపోకూడదని, సంక్రాంతి పండుగ మన సంస్కృతికి, సాంప్రదాయాలకు నిలువుటద్దమని అన్నారు. భోగి మంటలు, ముగ్గుల సందడి, హరిదాసు కీర్తనల వెనుక ఉన్న అంతరార్థాన్ని విద్యార్థులకు వివరించారు. మన వారసత్వాన్ని గౌరవించి, పండుగలను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ వేడుకల్లో అధ్యాపక బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సందడి చేశారు. విద్యార్థుల రంగురంగుల ముగ్గులు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ శోభను రెట్టింపు చేశాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం పదిలం



వీరఘట్టం, జనవరి 10 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, దీనిని అందరూ అలవర్చుకోవాలని మండల యాంకర్ ఎం.సింహాచలం అన్నారు. మండలంలోని తూడి గ్రామంలో ఎన్ఎంఎన్ఎఫ్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక-2026 గ్రామ సభను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. దీనిలో భాగంగా పిఎండిఎస్ వేయటం వల్ల భూమికి కలిగే లాభాలు మరియు ఆ పండిన పంటల మనం తినడం వల్ల మనకు ఎంత ఆరోగ్యంగా ఉంటుందో ఆయన ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం విశిష్టత గురించి భూమి ఆరోగ్యం ప్రకృతి వ్యవసాయంతోనే ముడిపడి ఉందని, ప్రకృతి వ్యవసాయం ఏ రకంగా చెయ్యాలి అనే విషయాలను ఆయన వివరించారు. విత్తన శుద్ధి కోసం బీజామృతం రైతుల సమక్షంలో తయారు చేశారు. దీనికి రైతులందరూ స్పందించి ప్రతి ఒక్కరు కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తామని ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు రౌతు నవీన్ కుమార్, ఎఫ్ ఎం టి గౌరినాయుడు, టిఐసిఆర్ పి సత్యవతి, స్వాతి, ప్రసాద్, రాజేశ్వరి, పాల్గొన్నారు. గ్రామ సభ అనంతరం ర్యాలీని నిర్వహించారు.

## పొల్లలో తెలుగుదనం ఉట్టిపడేలా ఘనంగా సంక్రాంతి సంబరాలు



సీతంపేట, జనవరి 10 ప్రభాతవార్త పొల్ల గ్రామంలో ఆంధ్ర వానవాసి కళ్యాణ్ ఆశ్రమం మన్య ప్రగతి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు భోగి మంటలు 350 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి 7 వేల రూపాయలు, రెండో బహుమతి రూ.5,000, మూడో బహుమతి 3,000 రూపాయలను విజేతలకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ సత్యేంద్ర సింగ్ అఖిల భారత వనవాసి కళ్యాణ్ ఆశ్రమ అధ్యక్షులు డా.గేదెల రవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, మన్య ప్రగతి చైర్మన్ సుజాత ప్రాంత మహిళా సంఘ ప్రముఖ్ మండంగి ప్రకాష్ పొల్ల, మాజీ ఎంపీటీసీ జి.రమణమ్మ, బిజెపి మహిళ కార్యదర్శి రేవల్ల భాస్కరరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్ర జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త: స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు రంగోలి పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ శాసనపురి మధుబాబు భోగి మంటలు వెలిగించి విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ మెట్ట ఆంజనేయులు, అధ్యాపకులు బివి రమణ, రమణ ప్రసాద్, స్వాతి, రవికుమార్, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటించండి.. సురక్షితంగా ఉండండి

**-ఆటోలో ప్రచారం చేస్తున్న వీరఘట్టం పోలీస్**



వీరఘట్టం, జనవరి 10 ప్రభాతవార్త జాగ్రత్తలు పాటించండి సురక్షితంగా ఉండండి అంటూ గ్రామాల్లో ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఆటోలో ప్రచారం చేయిస్తున్నారు. పోలీస్ శాఖ సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకుంటే ముందస్తు నేర నివారణ చర్యలు చేపట్టవచ్చని ఆయన అన్నారు. ఒంటరి మహిళలు, వృద్ధులు, ఆడపిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, గ్రామాల కల్లాలకు వెళ్లేటప్పుడు ఒంటిపై బంగారు నగలు వేసుకొని వెళ్లకూడదన్నారు. చుట్టాలు ఇళ్లకు వెళ్లేటప్పుడు ఇంటిపై గట్టిగా నిఘా వేసి వెళ్లాలన్నారు. వీలైనంతవరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు విలువైన వస్తువులను, డబ్బును ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏది ఏమైనా పండగ పూట జాగ్రత్తలు పాటించాలంటూ వారు ప్రజలకు సూచిస్తూ ముమ్మరంగా ప్రచారం చేయిస్తున్నారు.

## పాతపట్నం మోడల్ స్కూల్లో సంక్రాంతి శోభ



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ రత్నకుమారి, మహిళా ఉపాధ్యాయినిలు కలిసి కొత్త కుండలో పాలు, పాయసం వంటతో ప్రారంభించి, భోగి మంటలను వెలిగించి ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు పాఠశాల మైదానంలో వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంట చుట్టూ వేసిన సంక్రాంతి నృత్యాలుతో పాఠశాలకు ముందే సంక్రాంతి పండగ శోభ వచ్చింది. ఈ సంబరాలకు పంచెకట్టు, కండువాలుతో వచ్చిన మగ ఉపాధ్యాయులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమం ఆసాంతం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద రావు, పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, సంక్రాంతి సెలవులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హోమ్ వర్క్ గురించి విద్యార్థులకు తెలియజేశారు.

## సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేయడం తగదు...

**జిల్లా జాయింట్ సెక్రటరీ కె.వి సత్యనారాయణ**



ఆమదాలవలస, జనవరి, 10(ప్రభాతవార్త)

సర్వేల పేరుతో పూర్తిస్థాయి సమాచారం, అవగాహన కల్పించకుండానే మరో వైపు బిఎల్ఓ విధులను అప్పగిస్తూ సచివాలయ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం తగదని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ, జిడబ్ల్యుఎస్ఈఎఫ్ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ కూన వెంకట సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది సర్వే పనుల నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు చూపిస్తూ పలు రిపోర్టుల పేరుతో తీవ్ర పని ఒత్తిడి కల్పించడం అన్యాయమన్నారు. ఈ ఒత్తిడి కారణంగా డిసెంబర్ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 మంది సచివాలయ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సచివాలయ ఉద్యోగుల పనితీరును తప్పుబట్టడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు, కరువు భత్యం, వేతన సవరణ కమిటీ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ ఛానల్ కల్పించి, ఖాళీగా ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల్లో వారిని భర్తీ చేయాలని ఆయన కోరారు.

# శ్రీకాకుళం వార్త



## ఆంధ్రా ఒడిషా సరిహద్దులో కొనసాగుతున్న ఎక్సైజ్ దాడులు



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త: ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో అంతర్ రాష్ట్ర ఉమ్మడి ఎక్సైజ్ శాఖా ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులను మరింత విస్తృత పరుస్తూ రెండవ రోజు కూడా నిర్వహించారు. శ్రీకాకుళం డిప్యూటీ కమీషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్ర రావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్ తిరుపతి నాయుడు, ఒడిశా రాష్ట్రం గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్, గజపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రెండో రోజు శనివారం కూడా ఈ దాడులను ఆంధ్రాలోని టెక్కలి, మెళియాపుట్టి, పలాస మండలాల యొక్క ఏఒబి సరిహద్దు నందు ఉన్న ఒడిశా రాష్ట్ర పరిధిలోని గారబంద పోలీస్ స్టేషన్ పరిధిలోని గొట్టయి, రామచంద్రాపూర్ మరియు కాశీనగర్ పిఎస్ పరిధిలోని శిరడా గ్రామాలపై అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సుపెరింటెండెంట్ పి.రామచంద్ర కుమార్ పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, టెక్కలి, పలాస, పాతపట్నం మొబైల్ పార్టీ, ఏ.ఈ.ఎస్.టాస్క్‌ఫోర్స్ పలాస, శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వారు, ఒడిషా రాష్ట్రంలోని గజపతి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్, పర్లాఖిముండి రేంజ్ ఇన్‌స్పెక్టర్, గజపతి జిల్లా మొబైలు యూనిట్ ఇన్‌స్పెక్టర్, కాశీనగర్ మరియు పర్లాఖిముండి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, గారబంద మరియు కాశీనగర్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది మరియు ఒడిషా ఏపిఆర్ ఫోర్స్‌లతో కలిసి సంయుక్తముగా దాడులు జరిపి సుమారు 14,100 లీటర్ల పులిసిన బెల్లపు వూటను ధ్వంసం చేసి, 1070 లీటర్ల నాటు సారాయిని స్వాధీనము చేసుకొని కేసులు నమోదు చేయడమైనదని ఒక ప్రకటనలో పాతపట్నం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. రానున్న పండుగల దృష్ట్యా ఈ దాడులు చేయడమైనదని, మరిన్ని దాడులు జరుపుతామని ఆయన తెలిపారు. అంతేకాకుండా శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ మొబైల్ పార్టీలు, టాస్క్ ఫోర్స్‌లు, చెక్ పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వారు 24 గంటలు ఏఒబి సరిహద్దులో దాడులు చేస్తున్నాయని అనవసరంగా ఇతర రాష్ట్రాల మద్యం బాటిల్ (ఎన్డిపిఎల్)తో కనుక ఆంధ్రా బోర్డర్‌లో అడుగు పెడితే అరెస్ట్ చేయడమే కాకుండా కేసు నమోదు చేసి వారు ఉపయోగించినటువంటి వాహనమును కూడా స్వాధీన పరుచుకుంటామని ఆయన హెచ్చరించారు.

## గాడిదపాయలో కూరంగి ముఖలింగం సంతాప సభ



సీతంపేట, జనవరి 10 ప్రభాతవార్త గిరిజన పోరాటంలో అనేక త్యాగాలు చేశారని గిరిజనులను కూడగట్టి గిరిజన సంఘాల ఏర్పాటు చేసి ప్రభుత్వ విధానాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాని సిపిఐ నాయకులు కూరంగి ముఖలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తన గ్రామంలో సిపిఎం పార్టీ సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఆ పోరాటాల ఫలితమే ఈరోజు గిరిజన ప్రాంతంలో భూమితో పాటు అనేకమైన హక్కులు, చట్టాలు గిరిజనులకు వచ్చాయని మళ్లీ ఇప్పుడు పరిపాలన చేస్తున్న పాలకవర్గాలు ఆ హక్కులను, చట్టాలను వెనక్కి తీసి గిరిజనులకి అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతిరావు. మన్య ప్రగతి చైర్మన్ డాక్టర్ గేదెల రవి. కూరంగి జగదీష్ నాయుడు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా మ్యాక్స్ నూతన సినీ థియేటర్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, జనవరి 10 ప్రభాతవార్త: నియోజకవర్గ కేంద్రంలో ఆధునిక సాంకేతికత మరియు వసతులతో అన్ని వర్గాల ప్రజలకు వినోదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన శ్రీ ఉమా సిని మ్యాక్స్ రెండు స్క్రీన్‌లను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవింద రావు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ పాతపట్నం నియోజకవర్గంలో వినోదం, ఉపాధి, వాణిజ్య అభివృద్ధికి ఇటువంటి ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రజలకు కుటుంబ సమేతంగా వినోదం అందుబాటులోకి రావడం సంతోషకరమని తెలి పారు. ప్రభుత్వం అభివృద్ధి సంకల్పంతో ముందుకు సాగుతుందని, నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు సాంస్కృతిక, వినోద రంగాలకూ సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నూతనంగా రెండు థియేటర్లను నిర్మించి నియోజకవర్గ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతా వరణంలో వినోదాన్ని అందించేందుకు కృషిచేసిన థియేటర్ యాజమాన్యానికి ఎమ్మెల్యే అభినం దించారు. సినిమా థియేటర్ నిర్వాహకులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు : జనసేన ఇంచార్జ్ పేడాడ



ఆమదాలవలస, జనవరి 10,ప్రభాతవార్త

క్రీడలతో యువతకు భవిష్యత్తు ఉంటుందని ఆముదాలవలస జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు అన్నారు. మున్సిపాలిటీలోని 17వ వార్డు పూజారి పేటకు చెందిన విక్రమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 3 ప్రారంభోత్సవ పోటీల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణం,క్రమశిక్షణ, జట్టు సమిష్టికృషి, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మరియు నాయకత్వం, సహకారం మరియు విజయం మరియు వైఫల్యాన్ని నిర్వహించడం వంటి కీలకమైన జీవిత నైపుణ్యాలను బోధించడంలో యువతకు క్రీడల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం క్రీడాకారులతో ముచ్చటిస్తూ, ఆటల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని కనబరిచారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిగా రూ.15 వేలను పేడాడ రామ్మోహన్ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఎల్లప్పుడూ యువతకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలకు సైతం సహకరిస్తున్న పేడాడ రామ్మోహన్ కు క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సత్య సాయి బాబా సత్యనారాయణ వ్రతం



వంగర, జనవరి 10,ప్రభాతవార్త

మండలంలోని మద్దివలస సత్య సాయి బాబా మందిరం వద్ద సత్యసాయి సత్యనారా యణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో భక్తులు శనివారం నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని విశిష్ట పూజలు చేశారు. అష్టదిక్కులకు అధిపతులైన అష్టదిక్పాలకులను, నవగ్రహాలను తాంబూలాలతో పూజించడం ఈ వ్రతంలోని ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ,పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల దాడులు -- గంజాయి, మొబైల్ ఫోన్లు స్వాధీనం

శ్రీకాకుళం, జనవరి 10,ప్రభాతవార్త



జిల్లా, ఇచ్ఛాపురం పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై పోలీ సులు కఠిన చర్యలు చేపట్టి, రెండు వేర్వేరు ఘటనల్లో నిందితులను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురం రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసు వివరాలును ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.చిన్నంనాయుడు శనివారం రూపంలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, తేదీ 10.01.2025 నాడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో, ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు జంక్షన్, రైల్వే క్రాసింగ్ గేటు సమీపంలో గంజాయితో తరలిస్తున్న ముగ్గురు నిందితులను ఇచ్ఛాపురం రూరల్ పోలీసు యస్.ఐ ఆర్.జనార్ధనరావు అరెస్టు చేయడం జరిగింది. వారి వద్ద నుండి కేజీ 11.370 గ్రాముల గంజాయితో పాటు మూడు మొబైల్ ఫోన్లును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఒక నిందితుడిని ఇచ్ఛాపురం పట్టణ పోలీసు యస్.ఐ యమ్. ముకుందరావు అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి కేజీ 2.030 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు హెచ్చరించారు.

